

బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం
ఉమ్మడి జిల్లా ఐటీఎస్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు 7లో

ఒకరోజు ముందుగానే..



ఎన్టీఆర్ భరోసా
పెన్షన్ల పంపిణీకి సన్నాహాలు
నూరు శాతం
పంపిణీ పూర్తయ్యేలా ఏర్పాట్లు
జిల్లాలో 2.41లక్షల మంది
పెన్షన్‌దారులకు
రూ.100.51 కోట్లు లబ్ధి
పెన్షన్ల పంపిణీకి 4237
మంది సిబ్బంది నియామకం
కలెక్టర్ మహేష్‌కుమార్

రేపే జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ

అమలాపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూలేని విధంగా ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. సెప్టెంబరు 1 ఆదివారం సెలవు రోజు కావడంతో ఆగస్టు 31న ఇంటింటికీ తిరిగి పెన్షన్లు పంపిణీ చేసే ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. 30వ తేదీ సాయంత్రంలోగా బ్యాంకుల నుంచి పెన్షన్ల నగదును విత్‌డ్రాచేసి క్షేత్రస్థాయి సిబ్బందికి అందజేయాలన్నారు. లబ్ధిదారులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. పెన్షన్ల పంపిణీ పూర్తి అయ్యే వరకు సాధారణ బదిలీల నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బందిని రిలీవ్ చేయవద్దని ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పెన్షన్ల పంపిణీపై దిశానిర్దేశం చేశారు. 31వ తేదీ సాయంత్రానికి నూరుశాతం పెన్షన్ల పంపిణీ పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి నగదును విత్‌డ్రా చేసుకోవడంలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే లీడ్ బ్యాంకు మేనేజర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సాయంత్రంలోగా క్షేత్రస్థాయి సిబ్బందికి లబ్ధిదారుల మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. 31వ తేదీ ఉదయం 6 గంటలకు అన్ని సచివాలయాల పరిధిలో పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలని లేని పక్షంలో సంబంధిత ఎంపీడీవోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ రోజున ఎవరైనా లబ్ధిదారులు పెన్షన్లు అందుకోని పక్షంలో సెప్టెంబరు 2న అందించాలన్నారు. జిల్లాలో 2,41,354 మందికి వివిధ కేటగిరీల్లో పెన్షన్ల కింద రూ.100.51 కోట్లు లబ్ధి అందుతుందన్నారు. పెన్షన్ల పంపిణీకి ప్రత్యేకంగా 41.06 మంది సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖలకు చెందిన 131 మందితో కలిసి 4237 మంది పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అదనపు ఎస్పీగా ప్రసాద్

జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ



అమలాపురం టౌన్, ఆగస్టు 29: జిల్లా అదనపు ఎస్పీగా ఏవీఆర్‌పీబీ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికి యువత వెళ్లకుండా క్షేత్ర స్థాయి నుంచి ప్రచారాలు నిర్వహిస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నెల్లూరు జిల్లా క్రైమ్ విభాగంలో అదనపు ఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఆయన జిల్లాకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఖాదర్‌బాషాను హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

మళ్లీ గోకులాలు



మినీ గోకులాలతో తీరనున్న 'పాడి' రైతుల కష్టాలు
కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో..
గోకులాలకు వీడిన గ్రహణం
జిల్లాలో 1075 మినీ గోకులాల నిర్మాణమే లక్ష్యం
గోకులంగా మారనున్న వానపల్లి గ్రామం

పాడి రైతులకు మేలు చేసేలా మళ్లీ గోకులాల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పాడి రైతులను ప్రోత్సహించే విధంగా ఉపాధి హామీ పథకంలో గోకులాల నిర్మాణం చేపట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గోకులాల నిర్మాణాలను పూర్తిగా విస్మరించింది. అంతేకాకుండా బిల్లులు చెల్లింపులో తీవ్ర జాప్యం చేసింది. జగన్ ప్రభుత్వం కేవలం అమూల్ సేవలకే పరిమితమైంది. కనీసం పాల సేకరణ కోసం ఏర్పాటుచేసిన యూనిట్లను కూడా ప్రారంభించలేదు. ప్రస్తుతం ఆ యూనిట్‌లన్నీ నిరుపయోగంగా మారిపోయాయి. తిరిగి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గోకులాలకు పట్టిన గ్రహణం వీడింది.

●(అమలాపురం రూరల్)

	యూనిట్ కాస్ట్	ఉపాధి నిధులు	లబ్ధిదారుని వాటా
2 పాడిపశువులకు	రూ.1.15లక్షలు	రూ.1,03,500	రూ.11,500
4 పాడిపశువులకు	రూ.1.85లక్షలు	రూ.1,66,500	రూ.18,500
6 పాడిపశువులకు	రూ.2.30లక్షలు	రూ.2,07,300	రూ.23వేలు
20 గొర్రెలకు	రూ.1.30లక్షలు	రూ.91వేలు	రూ.39వేలు
50 గొర్రెలకు	రూ.2.30లక్షలు	రూ.1.61లక్షలు	రూ.69 వేలు
100 పక్షులు,కోళ్లకు	రూ.87వేలు	రూ.60,900	రూ.26,100
200 పక్షులు,కోళ్లకు	రూ.1.32లక్షలు	రూ.92,400	రూ.39,600



గోకులాలకు శ్రీకారం

పేద పాడి రైతులకు అండగా ఉండాలని ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని గోకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్డు నిర్మాణం, తొట్టి, పశుగ్రాసం నిల్వ ఉంచుకునే సామగ్రిని ఈ పథకంలో అందజేస్తారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల పాడి పశువులకు, పశుపక్ష్యాదులకు ఏవిధమైన నష్టం వాటిల్లకుండా రక్షణగా నిలిచేందుకు సైతం గోకులాలు ఉపయోగపడతాయి.

లబ్ధిదారుని వాటా 10 శాతం

గోకులాల నిర్మాణంలో పది శాతం వాటా సొమ్మును లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంది. షెడ్డుకు నిధులను ఉపాధి హామీ పథకంలో సమకూరుస్తారు. గొర్రెలు, మేకల షెడ్డుల నిర్మాణాలకు 30 శాతం వాటా సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది. పక్షులు, కోళ్ల పెంపకం కోసం పౌల్ట్రీ షెడ్ల నిర్మాణం కూడా చేపడతారు.

వానపల్లి..గోకులాల పల్లె

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 23న కొత్తపేట మండలం వానపల్లిలో జరిగిన ఉపాధి హామీ స్వర్ణ గ్రామసభలో పాల్గొన్నారు. పలువురు పాడి రైతులు గోకులాల నిర్మాణం కోసం సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఆయన తక్షణం స్పందించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో ఎందరు రైతులు మినీ గోకులాలు నిర్మించుకునేందుకు ముందుకు వస్తే అందరికీ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పశుసంవర్ధకశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో ఆ శాఖ అధికారులు గ్రామంలో మినీ గోకులాలు నిర్మించుకునే పాడి రైతులకు దరఖాస్తులను అందజేస్తున్నారు. రైతులంతా ముందుకు వస్తే వానపల్లి గ్రామమే భవిష్యత్తులో గోకులంగా మారనుంది.

జిల్లాలో 1075 మినీ గోకులాల నిర్మాణం లక్ష్యం

డాక్టర్ కర్నీడి మూర్తి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి



రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 1075 మినీ గోకులాలు నిర్మించేందుకు లక్ష్యంగా నిర్దేశించింది. దాంతో గ్రామాల వారీగా పాడి రైతులకు గోకులాల నిర్మాణం కోసం దరఖాస్తులను అందజేస్తున్నాం. పశువైద్య సహాయకులు సేకరించిన దరఖాస్తుల ఆధారంగా గ్రామసభలు నిర్వహించి ఆమోదం పొందాల్సి ఉంటుంది. సంబంధిత నివేదికను ఉపాధిహామీ పథకం అధికారులకు అప్పగిస్తాం. అక్కడి నుంచి ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఆమోదంతో ఉపాధి హామీ పథకంలో మినీ గోకులాల నిర్మాణం చేపడతారు.

ఆర్‌బీఐ ఆన్‌లైన్ క్విజ్

దేశ వ్యాప్తంగా నిర్వహణ
అండర్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులు అర్హులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, ఆగస్టు 29: భారతీయ రిజర్వు బ్యాంకు 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఔత్సాహిక అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులంతా క్విజ్ పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆర్బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీల పోస్టర్లను గురువారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ మాట్లాడుతూ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు అంటే ఇంటర్ పూర్తి చేసి గ్రాడ్యుయేషన్ కొనసాగిస్తున్న అన్ని కోర్సులకు సంబంధించిన విద్యార్థులు సెప్టెంబరు 17వ తేదీలోగా వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. ఇద్దరు విద్యార్థులు ఒక టీమ్‌గా క్విజ్ పోటీల్లో పాల్గొనాలి. విద్యార్థుల వయసు 25 ఏళ్లకు మించి ఉండకూడదు. ఈ పోటీలు ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయి జోనల్‌తో పాటు నాలుగు రౌండ్లుగా పోటీలు జరుగుతాయి. తరగతి గది, ఇంటి నుంచి కూడా విద్యార్థులు ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనవచ్చు. తుది రౌండ్‌లో పాల్గొనే విద్యార్థుల ప్రయాణ, బస ఖర్చులను ఆర్బీఐ భరిస్తుందన్నారు. రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి కింద రూ.2లక్షలు, రెండో బహుమతిగా రూ.1.50లక్షలు, మూడో బహుమతిగా రూ.లక్ష అందజేస్తారు. జోనల్ స్థాయిలో మొదటి బహుమతి రూ.5లక్షలు, రెండో బహుమతి రూ.4లక్షలు, మూడో బహుమతిగా రూ.3 లక్షలు, జాతీయ స్థాయి ఫైనల్ పోటీల్లో మొదటి విజేతకు రూ.10లక్షలు, రెండో బహుమతి కింద రూ.8 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.6 లక్షలు అందజేస్తారు. రిజిస్ట్రేషన్ కోసం విద్యార్థులు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

బడికి దాతలు బహుమానం



పాఠశాల భవనం

రూ.26 లక్షలతో భవనం కట్టించిన పూర్వ విద్యార్థి

మామిడికుదురు, ఆగస్టు 29: అక్షరాలు దిద్దించి ఉన్నత స్థానానికి ఎదగడానికి పునాదిగా నిలిచిన బడిని మరిచిపోకుండా రూ.26 లక్షలతో భవనం నిర్మించి బహుమానంగా ఇచ్చారు ఓ ఎన్‌ఆర్ఐ. జిల్లాలోని మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుల లక్ష్మీనరసింహచైనులు 1940-45 మధ్య ఆదుర్రు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు విద్యనభ్యసించారు. ఆ తర్వాత శాస్త్రవేత్తగా ఎదిగి అమెరికాలో స్థిరపడ్డారు. తాను చదువుకున్న స్కూల్‌కు ఏదో ఒకటి చేయాలనే తలంపుతో సుమారు రూ.26 లక్షలతో పాఠశాల భవనాన్ని నిర్మించి ఇచ్చారు. దాతలు ఉపాధ్యాయుల లక్ష్మీనరసింహచైనులు-అన్నపూర్ణ దంపతులను స్థానిక సర్పంచ్ శ్రీనివాస్, హెచ్‌ఎం పల్లంరాజు తదితరులు అభినందించారు. రెండు గదుల భవన నిర్మాణం పూర్తవడంతో గురువారం దాతల తరపున వారి బంధువులు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు భవనాన్ని అప్పగించారు.



గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ నిషాంతి

గిడుగు..భాషకు వెలుగు

కలెక్టరేట్‌లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

అమలాపురం టౌన్, ఆగస్టు 29: అతి ప్రాచీనమైన భాషల్లో తెలుగు ఒకటని అటువంటి భాషకు వెలుగులు తీసుకువచ్చిన ఘనత గిడుగు రామమూర్తి పంతులుకు దక్కుతుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి జేసీతో పాటు డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఈవో ఎం.కమలకుమారి, కలెక్టరేట్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ తెలుగు భాష విశిష్టతను వివరించారు.

క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలి

కలెక్టర్ మహేష్‌కుమార్ క్రీడాకారులకు సత్కారం

అమలాపురం టౌన్, ఆగస్టు 29: క్రీడల్లో రాణిస్తూ జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి క్రీడాకారులకు పిలుపునిచ్చారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత కలెక్టరేట్ నుంచి క్రీడాకారులు, విద్యార్థులు చేపట్టిన 3కే రన్‌ను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ పరంగా క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని ఆనందరావు చెప్పారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రీడాకారులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కలిసి 39 మందిని సత్కరించి కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, మునగాల మన్యం, వెటరన్ క్రీడాకారిణిలు షాహీరా, షకీలా, అంతర్జాతీయ క్రీడల్లో రాణిస్తున్న పి.వందన తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, అల్లాడ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వందనను సన్మానిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్



3కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు



రుద్రాక్షలతో

వినాయకుడు, శివలింగం

కాకినాడ జిల్లా గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన కోలా వీరబాబు ఐదు వేల రుద్రాక్షలతో నాలుగు అడుగుల వినాయక విగ్రహాన్ని, మూడు అడుగుల శివలింగాన్ని తయారు చేశాడు. వినాయకచవితికి వీటిని ప్రత్యేకంగా ప్రతిష్ఠిస్తానని ఆయన చెప్పాడు.

- గొల్లప్రోలు

మాతృ భాషపై మమకారం

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయాధికారి డాక్టర్ కృష్ణప్రసాద్



రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఒక న్యాయాధికారి మాతృ భాషపై మమకారం చాటుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సెల్ ఫోన్ చోరీ కేసులో 2022లో ఇద్దరిపై కేసు నమోదైంది. రెండేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసు గురువారం మొదటి శ్రేణి రెండో అదనపు న్యాయాధికారి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ బెంచిపైకి వచ్చింది. ఆయన విచారించి నేరం రుజువు కాకపోవడంతో నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ తెలుగులో తీర్పు వెలువరించారు. అంతే కాకుండా తీర్పు కాపీని కూడా తెలుగులోనే ఇచ్చారు. అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మన భాషను మించిన భాష లేదన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తెలుగు భాషను ప్రోత్సహించడానికి తన వంతు కృషిలో భాగంగా 2018 నుంచి తెలుగు భాషా దినోత్సవం రోజున ఏదో ఒక కేసులో తీర్పును తెలుగులో చెప్పడం అలవాటు చేసుకున్నానన్నారు. కక్షిదారులకు అర్థమయ్యేలా వారి మాతృ భాషలో తీర్పులను తర్జుమా చేసి ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానాలు సైతం చెప్తున్నాయని గుర్తు చేశారు. తెలుగు భాష చాలా గొప్పదని, మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేయాలన్నారు. కృష్ణప్రసాద్‌ను పలువురు అభినందించారు.



తెలుగు భాష తియ్యదనం

అమ్మలాంటి అనురాగం... అమృతంలాంటి కమ్మదనం కల తెలుగు మన మాతృ భాష కావడం అదృష్టమని ఓక్‌వుడ్ స్కూలు చైర్మన్ కె.రాంబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు బీజాపురి టౌన్‌షిప్‌లో గల ఈ స్కూలు విద్యార్థులు గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు.

- దివాన్‌చెరువు

బీఎస్‌ఎన్‌ఎల్‌కు పూర్వవైభవం తెస్తాం



ఉమ్మడి జిల్లాలో 2 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు లక్ష్యం

అల్లూరి జిల్లాలో కొత్తగా 400 సెల్ టవర్ల ఏర్పాటు

3జీ సిమ్‌లను తీసుకొచ్చి 4జీ సిమ్‌లను ఉచితంగా పొందండి

బీఎస్‌ఎన్‌ఎల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు

అమలాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బీఎస్‌ఎన్‌ఎల్‌కుపూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని ఉమ్మడి జిల్లా ఐటీఎస్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో 2లక్షల బీఎస్‌ఎన్‌ఎల్ ఫోన్ కనెక్షన్లు ఉండేవని, నేడు అవి 10వేలకు పడిపోయాయన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థ టాటా కన్సల్టెన్సీతో ఒప్పందం కుదుర్చుకుని శరవేగంగా ముందుకు సాగుతోందని వివరించారు. జిల్లాలో 2 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని, త్వరలోనే ఆ లక్ష్యాన్ని సాధిస్తామని వెల్లడించారు. మారుమూల ప్రాంతాలకు సైతం బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను విస్తరిస్తామని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద డీఈ పీఎస్‌ఎల్ నరసింహారావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం రాజు మాట్లాడుతూ లక్ష్య సాధనలో ప్రతి ఉద్యోగీ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఏజెన్సీ మండలాల్లో సైతం బీఎస్‌ఎన్‌ఎల్ సేవలను విస్తరించనున్నామన్నారు. తక్కువ ఖర్చుతో మంచి సేవలందించేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. బీఎస్‌ఎన్‌ఎల్ ప్రభుత్వరంగ సంస్థ కావడం వల్ల ప్రజలకు అందుబాటులోనే టారిఫ్‌లు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే ప్రముఖ సంస్థల నుంచి ఖాతాదారులు బీఎస్‌ఎన్‌ఎల్‌లోకి మారుతున్నారని, త్వరలో మరింత వేగం పెరుగుతుందన్నారు. తొలుత సంస్థ కార్యాలయం వద్ద బీఎస్‌ఎన్‌ఎల్ పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సిబ్బందితో కలిసి పట్టణ వీధుల్లో చేపట్టిన మోటారు సైకిళ్ల ర్యాలీలో జీఎం పాల్గొని పలుచోట్ల మాట్లాడారు. రాజమహేంద్రవరం డీజీఎం వి.రాజశేఖర్‌బాబు, కాకినాడ డీజీఎం డి.సైదానాయక్, రాజమహేంద్రవరం డీజీఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రాజమహేంద్రవరం ఏజీఎం మార్కెటింగ్ అండ్ ఈబీ బొమ్మిడి శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఏజీఎం వి.శారదాదేవి, ఏజీఎంలు టి.జయశ్రీ, వైశైలజ, మంగళంపల్లి అంజిబాబు, పెనుమాల చిట్టిబాబు, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేలా తీసుకుంటున్న చర్యలను జనరల్ మేనేజర్ రాజు ఇలా వివరించారు.

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 400 బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్లు ఉన్నాయి.
- సీఎండీ ఆదేశాలతో కొత్తగా 50 సెల్ టవర్లు మంజూరు కాగా కోనసీమ జిల్లాకు ప్రత్యేకంగా 20 కేటాయించారు.
- ప్రధానమంత్రి అంత్యోదయ పథకంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని 11 ఏజెన్సీ మండలాల్లో కొత్తగా 400 సెల్ టవర్లు ఏర్పాటు చేస్తాం.
- ఇప్పటి వరకు ఏజెన్సీ మండలాల్లో జియో, ఎయిర్‌టెల్ వంటి సర్వీసులు కూడా అందని ప్రాంతాల్లో ఈ సెల్ టవర్లు ఏర్పాటు చేస్తాం. అక్టోబరు నెలాఖరు నాటికి 90 శాతం సెల్ టవర్ల నిర్మాణం పూర్తి చేయడం లక్ష్యం.
- బీఎస్‌ఎన్‌ఎల్‌లో ఇప్పటికే 2జీ, 3జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. కొత్తగా 4జీని తీసుకువచ్చాం. 3జీ సిమ్‌లను తీసుకువచ్చి 4జీ సిమ్‌లను ఉచితంగా పొందొచ్చు. 4జీ సిమ్‌లతో హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తాము.
- త్వరలోనే 5జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.
- ఉమ్మడి జిల్లాలో 5.50లక్షల మొబైల్ ఫోన్లు బీఎస్‌ఎన్‌ఎల్‌లో ఉన్నాయి. ఈ నెల 30వేలు కనెక్షన్లు అదనంగా పొందాల్సి ఉండగా ఇప్పటికే 26వేల కనెక్షన్లు సాధించాము. గత నెలలో 24వేల కనెక్షన్లు పొందాము..



ప్రచారంలో నినాదాలు చేస్తున్న జనరల్ మేనేజర్ రాజు, ఉద్యోగులు

నేడు రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 29: అన్నవరం దేవస్థానంలో శ్రావణ శుక్రవార వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఆసక్తి గల మహిళలు కొబ్బరికాయ, అరటిపళ్లు, పువ్వులు తీసుకొస్తే మిగిలిన ద్రవ్యాలను దేవస్థానం అందజేస్తుందని చెప్పారు.

6న జడ్పీ సాధారణ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, ఆగస్టు 29: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సాధారణ సర్వసభ్య, స్థాయీ సంఘాల సమావేశాలను సెప్టెంబరు 6వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధి కోర్సులకు మూడు నెలలు ఉచిత శిక్షణ

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29: పీఎంకేవీవై 4.0 పథకంలో భాగంగా కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ తెలిపారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఇన్‌స్టలేషన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్, ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండిషనర్, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థుల వయసు 45 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ జెరాక్స్, ఐటీఐ పాస్ సర్టిఫికెట్, ఇంటర్ పాస్ సర్టిఫికెట్, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ తదితర వివరాలతో కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కార్యాలయంలో సెప్టెంబరు 3వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8790798431 నెంబరును సంప్రదించాలని చెప్పారు.



సత్యదేవుని సన్నిధిలో అనంతపురం ఎంపీ

అన్నవరం, ఆగస్టు 29: రత్నగిరిపై వేంచేసియున్న సత్యదేవుని అనంతపురం ఎంపీ బీకే పార్థసారథి గురువారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈవో సస్పెన్షన్

ద్రాక్షారామ, ఆగస్టు 29: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయం ఈవో పీటీవీ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ దేవదాయ శాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆలయానికి రథం తయారీతో పాటు పలు ఆరోపణలపై మంత్రి సుభాష్ ఈవోపై విచారణ జరిపించారు. ఇటీవల దేవదాయ శాఖ ఆర్జేసీ కె.సుబ్బారావుతో పాటు అధికారులు రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ జరిపి కమిషనరుకు నివేదిక అందజేశారు. రథం తయారీకి దాతల నుంచి చందాలు వసూలు చేయడంలో నిబంధనలు పాటించకపోవడం, కమిషనరు అనుమతి తీసుకోకపోవడం కారణంగా చూపించి ఈవోను సస్పెండ్ చేశారు.

సంజయ్ కలాసీ సేఫ్!

నేడు పోలీసుల ముందుకు కిడ్నాపర్లు!

మధ్యవర్తి ద్వారా పోలీసులతో మంతనాలు

స్వచ్ఛందంగా లొంగుబాటుకు అంగీకారం







అపహరణకు గురైన సంజయ్ కలాసీ (ఎడమ), నిందితులు మున్నా, స్వామినాయుడు (కుడి)

రాజమహేంద్రవరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశాకు చెందిన చేపల వ్యాపారి సంజయ్ కలాసీని అపహరించిన ఘటనలో నిందితులు మధ్యవర్తి ద్వారా పోలీసులతో మాట్లాడారని తెలుస్తోంది. సంజయ్ కలాసీ అమలాపురం, తుని పరిసర ప్రాంతాల్లో చేపల రైతుల వద్ద నుంచి సరుకు కొనుగోలు చేసి ఒడిశా తీసుకెళ్తాడు. ఓ ఐదారు నెలలు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించాడు. దీంతో స్వామినాయుడు అనే మధ్యవర్తి కమీషన్ కోసం పలువురు రైతుల వద్ద నుంచి సంజయ్‌కు సరుకు ఇప్పించాడు. ఈ క్రమంలో సుమారు రూ.3 కోట్లు బకాయిపడ్డాడు. వివిధ పోలీస్ స్టేషన్లలో అతడిపై ఏడు కేసులు ఉన్నాయి. కలాసీపై పోలీసులకు ఫిర్యాదు చేయడం.. వారు అరెస్టు చేయడం.. జైలు నుంచి బెయిల్‌పై విడుదలై ఒడిశా వెళ్లిపోవడం జరుగుతోంది. ఇలా మూడేళ్ల నుంచీ వేధిస్తున్నాడు. అందరూ తెలిసినవాళ్లు కావడంతో రోజూ తమ బాకీల కోసం అడుగుతుండడంతో స్వామినాయుడు వారి కంటపడకుండా ఊరు విడిచి తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో విసుగు చెందిన స్వామినాయుడు జైలు నుంచి విడుదలయ్యే సమాచారం తెలుసుకుని అపహరించాడు. దీనిపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదు చేసి ఆరు ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. అమలాపురం, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టు ప్రాథమికంగా తెలుసుకున్నారు. ఈలోపు గురువారం ఒక మధ్యవర్తి పోలీసులతో మాట్లాడి నిందితులు వచ్చి లొంగిపోతారని, బకాయిలు వసూలు కోసమే వారు అలా చేశారని చెప్పారు. పోలీసులు సానుకూలంగా స్పందించడంతో శుక్రవారం ఉదయం పోలీసుల ముందుకు నిందితులు వచ్చే అవకాశం ఉంది. బాధితుల్లో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గ్రామానికి చెందిన వాళ్లే ఎక్కువ మంది ఉన్నారని చెప్తున్నారు. దీంతో ఆయన స్వయంగా రంగంలోకి దిగి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన విధానం కాదని మందలించడం, నిందితులు నేరస్వభావం కలిగిన వారు కాకపోవడం వల్ల పోలీసుల ముందుకు రావడానికి ఒప్పుకున్నారని తెలుస్తోంది. అపహరణకు గురైన సంజయ్ కలాసీకి ఎలాంటి హానీ తలపెట్టలేదని పోలీసులు నిర్ధారించుకున్నారు. సంజయ్.. అతడిని అపహరించిన నిందితులంటూ స్వామినాయుడు, మున్నా ఫొటోలను ఎస్పీ కార్యాలయం మీడియాకు విడుదల చేసింది. ఆచూకీ తెలిసిన వారు 9440796574, 9490760792 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు కోరారు.



బదిలీల ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీ నరసింహారావు

పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 29: మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా జరిగిందని కాకినాడ కమిషనర్ భావన అన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల పరిధిలో ఉన్న 319 వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ హాలులో జరిగింది. ఆర్డీఎంఏ పరిధిలో అడ్మిన్ సెక్రటరీలకు మండపేట కమిషనర్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు పిఠాపురం కమిషనర్, శానిటేషన్ సెక్రటరీలకు తుని కమిషనర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ (ఎస్ఈపీహెచ్) పరిధిలోని ఎమినిటీ సెక్రటరీలకు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఆర్డీటీసీపీ పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిషనర్ భావనతో పాటు అడిషనల్ కమిషనర్, రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు పర్యవేక్షించారు. ఉద్యోగుల కోరిక మేరకు కొన్ని బదిలీలు జరిగాయి. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, వితంతువులు, భార్యభర్తలు పరస్పర అవగాహనతో పలువురికి బదిలీలు చేపట్టారు. వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలు 20 మంది, వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 41 మంది, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు 16 మంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు 18 మంది, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు 23 మంది, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు 40 మంది... మొత్తం 158 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 139 మంది హాజరయ్యారు. వీరందరికీ బదిలీల కౌన్సెలింగ్ చేశారు. బదిలీల ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 31వ తేదీలోపు ఉత్తర్వులు అందజేస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు.





పిఠాపురం పాదగయ క్షేత్రంలో వరలక్ష్మీ వ్రత టోకెన్ల కోసం క్యూలైన్లలో కూర్చున్న మహిళలు

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

» పిఠాపురం పాదగయలో విస్తృత ఏర్పాట్లు » 12వేల చీరలు పంపించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ » టోకెన్ల కోసం మహిళల క్యూ

పిఠాపురం, ఆగస్టు 29: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణకు దేవదాయ శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంతో పాటు సరస్వతీదేవి మందిరం, చండీహోమం జరిగే ప్రాంతంలోనూ వ్రతాలు నిర్వహించనున్నారు. మూడు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌లో రెండువేల మంది మహిళలు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. వారికి పూజా సామగ్రిని సమకూర్చనున్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొనే మహిళలకు చీరలు, పసుపు, కుంకుమను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమకూర్చారు. 12వేల చీరలు పంపించినట్టు జనసేన వర్గాలు తెలిపాయి. పాదగయలో ఆరువేల మంది మాత్రమే వ్రతాలు ఆచరించే అవకాశం ఉంది. మిగిలిన వారికి టోకెన్లు ఇచ్చి చీరలు అందిస్తారని చెప్తున్నారు.

వరలక్ష్మీ వ్రతాల కోసం మహిళలకు టోకెన్ల జారీ గందరగోళంగా మారింది. సాధారణంగా పాదగయ అధికారులు టోకెన్లు ఇచ్చే సమయాన్ని ముందుగా ప్రకటిస్తారు. ఈసారి దానిని రహస్యంగా ఉంచడంతో పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఉదయం 9 గంటలకే వచ్చి క్యూలైన్లలో నిలుచున్నారు. వర్షానికి తడుస్తూ, ఉక్కపోతతో సతమతమవుతూ ఐదు గంటలకు పైగా వేచి చూడాల్సి వచ్చింది. పాదగయ అధికారులు మధ్యాహ్నం 2.15 గంటలకు టోకెన్ల జారీ ప్రారంభించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ దగ్గరుండి పర్యవేక్షించారు. 2వేల మందికి టోకెన్లు పంపిణీ చేసినట్టు పాదగయ అధికారులు తెలిపారు. పలువురు మహిళలు తమకు టోకెన్లు అందలేదని ఈవో కార్యాలయం వద్ద సిబ్బందిని ప్రశ్నించడం కనిపించింది.

పాదగయలో వరలక్ష్మి వ్రతం ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించినట్టు ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ తెలిపారు. సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వ్రతాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

కోలుకుంటున్న బాలికలు

ఏలేశ్వరం, ఆగస్టు 29: ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన వారిలో బుధవారం రాత్రి వరకు 32 మందికి వైద్య సేవలు అందించారు. గురువారం ఉదయం మరో ఇద్దరు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. మొత్తం 34 మందికి వైద్య సేవలు అందించగా వారిలో ఒకరిని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం సాయంత్రానికి కోలుకున్న ఎనిమిది మందిని డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం 24 మందికి వైద్య సేవలు అందిస్తున్నామని, విద్యార్థినులు కోలుకుంటున్నారని డాక్టర్ శైలజ చెప్పారు.

ప్రతి పనిలోనూ ఏకాగ్రత ఉండాలి

క్రికెట్ క్రీడాకారుడు కోనా శ్రీకర్ భరత్ (కేఎస్ భరత్)

పెద్దాపురం, ఆగస్టు 29: కాకినాడ జిల్లా పెద్దాపురంలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. క్రికెట్ క్రీడాకారుడు కోనా శ్రీకర్ భరత్ (కేఎస్ భరత్) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ఆవరణలోని ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తాను భారతదేశం తరఫున 69 మ్యాచ్‌లు ఆడానని, ఇప్పటికీ ప్రాక్టీస్ చేస్తున్నానన్నారు. చేసే ప్రతి పనిలోనూ ఏకాగ్రత ఉండాలన్నారు. క్రమశిక్షణతో సాధన చేస్తే సాధించలేనిది అంటూ ఏదీ లేదన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థలు చదువుతో పాటు క్రీడలకూ అధిక ప్రాధాన్యమివ్వడం గర్వకారణమన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన రాజేష్ కామిశెట్టి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విషయంలోనూ పోటీ పడాలని, అప్పుడే రాణించగలుగుతామన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. క్రికెటర్ భరత్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ రామకృష్ణ, కో-ఆర్డినేటర్ ప్రశాంతి, ఉషా చైతన్య పాల్గొన్నారు.



శ్రీప్రకాష్ పాఠశాల ఆవరణలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్రికెటర్ శ్రీకర్ భరత్

కూటమి గెలిచినందుకు కేదార్‌నాథ్‌లో పూజలు

పి.గన్నవరం, ఆగస్టు29: రాష్ట్రంలో కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో కె.ఏనుగుపల్లికి చెందిన టీడీపీ యువ కార్యకర్త నిమ్మకాయల శేషారావు కేదార్‌నాథ్‌లో కేదారేశ్వరుడికి కూటమి నాయకులు పేరిట పూజలు నిర్వహించారు. కేదారేశ్వరుడి ఆలయ ప్రాంగణంలో ప్రధాని నరేంద్రమోది, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేష్, నిమ్మల రామానాయుడు, ఎంపీ హరీష్‌బాలయోగి, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శించారు.

- గిడుగు రామమూర్తి పంతులుకు నివాళులు
- తెలుగు అధ్యాపకులకు సత్కారాలు
- తెలుగువారి వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం





అమలాపురం భాష్యం స్కూలులో విద్యార్థుల వేషధారణలు, మండపేట సంగంబడిలో తెలుగు భాషా దినోత్సవం

అమలాపురం టౌన్, ఆగస్టు 29: అమలాపురం భాష్యం పాఠశాలలో తెలుగు భాషాదినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగువారి వేషధారణలతో ఆకట్టుకున్నారు. పురాతన నాణేలు, చెక్కబొమ్మలు, తాళపత్ర గ్రంథాలు, పిండివంటలను ప్రదర్శనలో ఉంచారు. తెలుగువారి రుచులను పద్యాల రూపంలో రుచి చూపించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకటశ్రీనివాస్, చాంప్స్ ఇన్‌చార్జి కె.నాగశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మాతృభాషను వారసత్వ సంపదగా అందించాలని బీకే స్వరూప పేర్కొన్నారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ కుమారశాస్త్రి అధ్యక్షతన తెలుగు వైభవం సాహితీ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్వరూప తెలుగు విశిష్టతను వివరించారు. తెలుగు అధ్యాపకులు ఎస్ఆర్ఎస్ కొల్లూరి, పెమ్మరాజు గోపాల్, కేటీ పద్మజ పాల్గొన్నారు. అమలాపురం వెంకటేశ్వరా డిగ్రీకళాశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో సంప్రదాయ వస్త్రధారణలతో పాల్గొన్నారు. తెలుగు కళావైభవాన్ని ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ కేఎస్వీఎస్ మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహారావు, ఏవో కరాటం ప్రవీణ్, కె.శ్రావణ్‌దిలీప్, వై.వరప్రసాద్, సూర్యకుమారి పాల్గొన్నారు. తెలుగుకవి సీలి సంసోనును సత్కరించారు. శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పించి తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు, జిల్లాఅధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, మాకే బాలార్జునసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల్లో విద్యార్థులు పంచెకట్టు, చీరకట్టు బొట్టులతో హాజరై తెలుగువారి రుచులు, అభిరుచులను పద్యాలతో వివరించారు. తెలుగుతల్లి వేషధారణ ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ ఏబీ నాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం శ్రీకృష్ణదేవరాయమహిళా కళాశాల, రావుబహదూర్ రఘుపతివెంకటరత్నంనాయుడు మహిళా డిగ్రీకళాశాలలో గురువారం గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు పచ్చిమాల శ్రీనివాస్‌ను విద్యార్థులు, కళాశాల యాజమాన్యం సత్కరించారు. కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానం, డైరెక్టర్ జగతా సురేష్, గణేశుల సత్యనారాయణ, మల్లాడి నరసిహం, పితాని గోపాలకృష్ణ, గుర్రం సూర్యమహేష్, కుసుమ నాగేంద్ర, పోలిశెట్టి ప్రసాద్, వంగా విశాల, కానూరి సత్యశ్రీ, టీచర్లు పాల్గొన్నారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం జడ్పీఉన్నత పాఠశాలలో గిడుగు వెంకటరామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని మాతృభాషా దినోత్సవం, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడా దినోత్సవాన్ని హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగులో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాభారతి, ఒలింపిక్ అసోసియేషన్ సౌజన్యంతో క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఉపాధ్యాయులు పి.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, వై.ఏసుకుమారి, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, జి.సాయిశ్రీనివాస్, వై.ఫణికుమార్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతిని గురువారం భట్నుపాలెం ఏపీఎస్ఎన్ జూనియర్ కళాశాల, అమృత ఇంగ్లీషు మీడియం పాఠశాల, శ్రీశ్రీకళావేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తెలుగు భాషను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి వివరించారు. విద్యార్థులకు తెలుగు కవితాగానంలో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అడపా గోపాలకృష్ణ, ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్ఎం నల్లా సరస్వతీదేవి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధుర కృపానందం పాల్గొన్నారు. భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన తెలుగు ఉపాధ్యాయులు పద్యాలు, కవితలతో తెలుగు మాధుర్యాన్ని అందించారు.

రావులపాలెం: ఈతకోట జడ్పీ పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం బండారు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన తెలుగుభాషా దినోత్సంలో భాగంగా వ్యాసచరన, పద్యాలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

మామిడికుదురు: తెలుగు భాషా దినోత్సవాన్ని మామిడికుదురు జడ్పీ హైస్కూలులో గురువారం నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు భాషపై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తెలుగు ఉపాధ్యాయుడు కర్రా సూర్యనారాయణ, హెచ్ఎం సీహెచ్ నిరంజని, చొప్పల రమేష్‌బాబు, కేవీఎల్ పద్మకుమారి, మట్టా నాగరాజు పాల్గొన్నారు.

యానాం: యానాం డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతికుమార్ తెలుగుతల్లి చిత్రపటానికి, గిడుగురామ్మూర్తి పంతులు చిత్రపటానికి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికివేసి నివాళులర్పించారు.

మండపేట: మండపేట సంఘంకాలనీ మండల పరిషత్ పాఠశాలలో హెచ్ఎం ఎం.మాణిక్యాంబ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. తాపేశ్వరం శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ నేతృత్వంలో చేపట్టిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వంగవీటి రంగా

రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన వంగవీటి రాధ



ద్రాక్షారామ, ఆగస్టు29: సామాజిక బలాన్ని సమాజసేవకు వినియోగించిన నాయకుడు స్వర్గీయ మోహనరంగా అని మాజీ శాసనసభ్యుడు వంగవీటి రాధ అన్నారు. గురువారం అన్నాయిపేటలో ఏర్పాటుచేసిన వంగవీటి రంగా విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయనమాట్లాడారు. భౌతికంగా దూరమైనా రంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ రంగా శాసనసభ్యునిగా కేవలం మూడేళ్ల పనిచేశారన్నారు. పేదలకోసం పోరాడి రంగా వీరమరణం పొందారన్నారు. రంగా మరణించి 36ఏళ్లు అయినప్పటికీ ఇప్పటికి తెలుగు రాష్ట్రాల్లో నిరంతరం విగ్రహావిష్కరణలు జరుగుతునే ఉన్నాయన్నారు. వందల కోట్లు రాదాకు ఇవ్వలేదని కోట్లు విలువ చేసే గౌరవం ఇచ్చారన్నారు. ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడారు. టీడీపీ నాయకులు రాయపురెడ్డి రాజా, చింతపల్లి వీరభద్రరావు, గంధం పళ్లంరాజు, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, దేగల సతీష్, వైసిపి నాయకులు పిల్లి సూర్యప్రకాష్, జక్కంపూడి గణేష్, తోటపృధ్వీరాజ్, రంగా అభిమానులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సైక్లింగ్ ర్యాలీ

అమలాపురం టౌన్, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా అమలాపురం పరంజ్యోతి పాఠశాల విద్యార్థులు సైక్లింగ్, వాకింగ్ ర్యాలీలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కార్ల్‌డేవిడ్ కొమానపల్లి క్రీడా జ్యోతితో ర్యాలీలో పాల్గొన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, జోనల్ ఇన్‌చార్జి గోపాలకృష్ణలు సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించగా ఏడు కిలోమీటర్లు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో జాషువా కొమానపల్లి, ప్రిన్సిపాల్ నూకపెయ్యి ఆదిలక్ష్మి పాల్గొన్నారు. సపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు, కార్యదర్శి కేతా సాయిదుర్గాప్రసాద్, జాతీయ కోచ్ యాండ్ర గౌతమ్ ఆధ్వర్యంలో అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాల ప్రాంగణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. సపక్‌తక్రా క్రీడాకారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీవీ బాబు, వెంకటేశ్వరరావు, ఎస్.రమణ, ఆర్కే రమేష్, అప్పాజీ, ఫిజికల్ డైరెక్టర్లు చిరంజీవి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా అంతర్జాతీయ చదరంగం పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న ద్రాక్షారపు సాత్విక్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, డిప్లమో ప్రిన్సిపాల్ ఫణిశంకర్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు, ఫిజికల్ డైరెక్టర్ మురళీ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలి

రాజోలు, ఆగస్టు 29: తల్లిదండ్రులు విద్యతో పాటు విద్యార్థులను క్రీడా రంగాల్లో ప్రోత్సహించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.సాయిబాబు అధ్యక్షతన గురువారం జరిగిన నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, సర్పంచ్ రేవు జ్యోతి, ఉప సర్పంచ్ పామర్తి రమణ, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీశ్వరి, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, పినిశెట్టి బుజ్జి, బర్రే శ్రీను, రావి మురళీ, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, కోళ్ల బాబి, కడలి వెంకటరమణారావు పాల్గొన్నారు.

నేత్రదానం

ముమ్మిడివరం, ఆగస్టు 29: అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన సుంకర ఆదిలక్ష్మి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులు బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు నేత్రాలు దానం చేశారు. ఆదిలక్ష్మి నేత్రాలను ఐ బ్యాంకు వైద్యురాలు సేకరించారు.

రొయ్యల అక్రమ సాగును అడ్డుకున్న కొత్తకోట గ్రామస్తులు



చేపల చెరువుల వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

కె.గంగవరం, ఆగస్టు 29: కొత్తకోటలో అక్రమంగా రొయ్యల సాగు చేయడంపై గ్రామస్తులు నిరసన చేపట్టారు. గ్రామంలో ఏడేళ్ల క్రితం సుందరపల్లికి చెందిన టీవీ సత్యనారాయణ ఏడు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. అక్కడ చేపల చెరువుల నిర్వహణకు అనుమతులు తెచ్చుకున్నాడు. బుధవారం రాత్రి ఈచెరువుల్లో రొయ్యలు పెంచడానికి ఒక వాహనంలో రొయ్య పిల్లలను తీసుకువచ్చి చెరువుల్లో కలపడానికి ప్రయత్నించాడు. గ్రామస్తులు దీనిని అడ్డుకున్నారు. గురువారం గ్రామ ప్రజలందరూ రోడ్డుపై ధర్నా చేశారు. వంటా వార్పుతో నిరసన చేపట్టారు. తహశీల్దార్ కె.సూర్యారావు, పామర్రు ఎస్ఐ కె.జానీబాషా, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్, ఫిషరిస్, వ్యవసాయశాఖ అధికారులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో, నిర్వా హకుడితో చర్చలు జరిపారు. చెరువుల్లో రొయ్య పిల్లలను వేయకుండా అడ్డుకున్నారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసు కుంటామన్నారు. ఎస్ఐ జానీ బాషా ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. పరిస్థితులు చక్కబడే వరకూ పికెట్ కొనసాగిస్తామన్నారు.

ఇసుక దోపిడీ వైసీపీకి నిరంతర ప్రక్రియ



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ద్రాక్షారామ, ఆగస్టు29: వెల్లసావరం జగనన్నకాలనీలో ఇసుక చోరీలో ప్రధాన నిందితులు వైసీపీకి చెందినవారేనని, అధికారంలో ఉన్నప్పటి నుంచి ఇసుక దోపిడీ వైసీపీ నాయకులకు నిరంతరం ప్రక్రియగా మారిందని కూటమి నాయకులు విమర్శించారు. గురువారం వెల్లసావరం జగనన్నకాలనీలో ఇసుకచోరీ జరిగిన ప్రాంతం వద్ద కూటమి నాయకుడు మాజీ సర్పంచ్ టేకుమూడి సత్యనారాయణ మాట్లాడుతూ ఇసుక చోరీకి పాల్పడింది మంత్రి అనుచరులు అనడం విడ్డూరంగా ఉందన్నారు. కేసులో ప్రధాన నిందితులు కట్టా పండు, కాంద్రేగుల సాయిలు వైసీపీలో పిల్లి సూర్యప్రకాష్ వెంట తిరిగిన వారేనని అన్నారు. మిగిలిన వారు కూడా మొన్నటి వరకు మీతో తిరిగినవారేనన్నారు. కంచుమర్తి బాబూరావు మాట్లాడుతూ ఇసుక దోపిడీలో నిందితులపై కేసు నమోదు చేయాలని మంత్రి సుభాష్ ఆదేశించారన్నారు. టీడీపీకి చెందిన వారు ఉన్నా వదలవద్దని ఆదేశాలిచ్చారన్నారు పెంకే సాంబశివరావు మాట్లాడుతూ టీడీపీకి ఇసుక దోపిడీ సంస్కృతి లేదన్నారు. ఇది వైసీపీసంస్కృతే అన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, జడ్పీమాజీ వైస్‌చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, పెంకే సాంబశివరావు, దంగేటి గౌరీశంకర్, కవల నానాజీ, కొసనా శ్రీనివాసరావు, జాస్తి విజయలక్ష్మి, గజలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాకారుడు కుంచేకు పురస్కారం

మండపేట, ఆగస్టు 29: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండపేటకు చెందిన క్రీడాకారుడు కుంచే రమేష్‌కు గురువారంకలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ క్రీడా పురస్కారాన్ని అందజేశారు.అతడి వద్ద టెన్నికాయిట్‌లో శిక్షణ పొందిన 62మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో, 23మంది జాతీయస్థాయిలో క్రీడల్లో సత్తాచాటారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా అంతర్వేదిని అభివృద్ధి చేస్తాం



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, ఆగస్టు29: అంతర్వేది పుణ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేది ఆలయ ప్రాంగణంలో చేపట్టే అభివృద్ధి పనులపై ఆలయ అధికారులు, స్థానిక నాయకులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం తూర్పు భాగంలో దాతల సహకారంతో నిర్మితమవుతున్న అన్నదాన భవన నిర్మాణ పనులను పరిశీలించి ఉత్తర దిక్కులో కొలను, గోశాల, కల్యాణకట్ట తదితర భవన నిర్మాణాలు చేపట్టేందుకు ముందుగా భూమినిఫిల్లింగ్ చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన వసతి భవనాలు, అవసరమైన స్థలాలను, దేవాలయం వద్ద ఖాళీ ప్రాంతానికి కొలతలు వేయించి సర్వేయర్‌తో మాట్లాడారు. ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, రావూరి నాగు, ఉండపల్లి అంజి, ఎంపీటీసీ బైరా నాగరాజు, తిరుమాని ఆచార్యులు, సర్వేయర్ భద్రరాజు, ఆకన బాబ్జినాయుడు, అయినపర్తి ఏసు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, చాగంటి స్వామి, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఇసుక చోరీపై ఆందోళన



జగనన్నకాలనీలో ఆందోళన చేస్తున్న వైసీపీ నాయకులు

ద్రాక్షారామ, ఆగస్టు 29: వెల్లసావరంలో జగనన్నకాలనీలో ఇసుక చోరీపై గురువారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ర్యాలీగా లే అవుట్ ప్రాంతానికి చేరుకున్నారు. ఇసుక తరలించిన ప్రాంతం వద్ద నినాదాలు చేశారు. దోషులను శిక్షించాలని, ఇసుక రికవరీ చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ఇంతసంతోషం, జడ్పీటీసీ వనుం సుబ్బారావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీధర్, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏడుకొండలు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఇసుక తరలింపు కేసులో తాము ఎవరి పేర్లు చెప్పడం లేదని, గృహ నిర్మాణ శాఖ ఏఈ మీడియాతో మాట్లాడిన ప్రకారం దోషులపై కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. మంత్రి సుభాష్ ప్రధాన అనుచరులు ఇసుకను చోరీ చేశారని ఆరోపించారు.

జనసేనలో చేరిన సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్



అల్లవరం, ఆగస్టు 29: యెంట్రుకోన సర్పంచ్ తిక్కిరెడ్డి నాగవెంకటశ్రీనివాస్ వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. జనసేన ప్రముఖులు చిక్కాల సతీష్, నల్లా శ్రీధర్, కంకిపాటి వీరబాబు సమక్షంలో సర్పంచ్ తిక్కిరెడ్డి, తిక్కిరెడ్డి రాజారావు, బాబూరావు, నవుండ్రు నాగరాజు తదితరులు అధిక సంఖ్యలో జనసేన పార్టీలో చేరగా నాయకులు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సర్పంచ్ శ్రీనివాస్‌ను అభినందించారు. ఆకుల బుజ్జి, చిక్కం భీముడు, పిండి రాజా, మోటూరి వెంకటేశ్వరరావు, తిక్కిరెడ్డి గోపాలకృష్ణ, ఎంపీటీసీ తిక్కా శేషుబాబు, వంగా దొరయ్యనాయుడు, వర్రే సూరిబాబు, చికిలే చిట్టిబాబు, చేట్ల మంగతాయారు, ఈటి గోపాలరావు పాల్గొన్నారు.

నేత్రదానంపై ర్యాలీ

అంబాజీపేట, ఆగస్టు 29: నేత్రదానం చేసి అంధులకు వెలుగునివ్వాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆప్తాలమిక్ అధికారి ప్రభాకరరావు ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ నుంచి వైద్య సిబ్బంది సెంటర్ వరకు ర్యాలి చేపట్టారు.

లఖ్‌పతి దీదీ పథకం కింద రూ.11.50 కోట్లు

అమలాపురంరూరల్, ఆగస్టు29: లఖ్‌పతిదీదీ పథకం కింద అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని డ్వాక్రా మహిళా సంఘాలకు రూ.11.50కోట్ల చెక్కును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అందజేశారు. అమలాపురండీఆర్డీఏ కార్యాలయంవద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రనాయకులు మెట్ల రమణబాబు, నామన రాంబాబు, జిల్లా ప్రధానకార్యదర్శి అల్లాడ సోంబాబు, నల్లా స్వామి, మల్లుల పోలయ్య, గెడ్డం మహాలక్ష్మిప్రభాకర్, మంద గెద్దయ్య, డ్వాక్రా డీపీఎం కేవీఎల్ అన్నపూర్ణ, ఏపీఎంలు సయ్యద్, సురేంద్ర, పీవీవీరమణపాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం అందరికి ఆదర్శం

కొత్తపేట, ఆగస్టు 29: రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం, ఆలోచన విధానం నేటి తరానికి ఆదర్శప్రాయమని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. గురువారం కొత్తపేట శివారు బండారుపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొల్లపల్లి డేవిడ్‌రాజు, మార్గన గంగాధరరావు, బూసి జయలక్ష్మిభాస్కరరావు, పల్లి భీమారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, నెల్లి లక్ష్మీపతి, సరెళ్ళ రాజబాబు, బండారు వీరబాబు, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాకొప్పిలింగేశ్వర ఆలయంలో అన్నదానం ప్రారంభం

కొత్తపేట, ఆగస్టు29: ప్రసిద్ధి చెందిన పలివెల శ్రీఉమాకొప్పిలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. ఇందులోభాగంగా శ్రావణ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నదాన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి సోమవారం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. అనంతరం ఎమ్మెల్యే బండారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, చవల జగన్నాథం, గొలకోటి ప్రసాద్, గుబ్బల మూర్తి, ముద్రగడ సుబ్బారావు, మైగాపుల గురవయ్య, చిక్కం హనుమంతు, తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిరాణా షాపులో విజిలెన్స్ తనిఖీలు

రూ.1.71లక్షల విలువైన సిగరెట్లు స్వాధీనం

కొత్తపేట, ఆగస్టు 29: కొత్తపేట పొట్టి శ్రీరాములు వీధిలో శ్రీలహరి ఫ్యాన్సీ అండ్ జనరల్ షాపులో గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సిగరెట్ ప్యాకెట్లపై చట్టబద్ధమైన వివరాలు లేకపోవడం, నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలు జాబితాకు సంబంధించి రూ.1.71లక్షల విలువైన 3420నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని క్రిమినల్ కేసు నమోదుకు పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. షాపు యజమాని గ్రంధి నాగవెంకట సూర్యనారాయణమూర్తి తాళ్లరేవుకు చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి సిగరెట్లు కొనుగోలు చేసి రిటైల్ షాపులకు ఇస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. దీనిపై లీగల్ మెట్రాలజీ అధికారులు కూడా రెండు కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్ఐ పి.జగన్నాథరెడ్డి, కుటుంబరావు, సిబ్బంది మణి, వీరబాబు, కిశోర్ పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం

కపిలేశ్వరపురం,ఆగస్టు29: అంగరలో చవితి ఉత్సవాలకు గురువారం అంగర ఆది గణపతి సెంటర్లో ఆలయకమిటీ చైర్మన్‌పెద్దింశెట్టి సూరిబాబు పూజలుచేసి రాటముహూర్తంచేశారు. మేడేపల్లి కొండ, పి.వీరబాబు, పసలపూడి కృష్ణ, కొండిపూడి శ్రీరాములు, ఎర్రంశెట్టి రమణ, మేక భద్రరావు, అచ్చన్న, పడాల రామకృష్ణ, యానాల సుబ్బారావు పాల్గొన్నారు.

తాగునీటి కోసం పంచాయతీకి తాళం



మలికిపురం, ఆగస్టు 29: రామరాజులంకలో తాగునీటి కోసం మహిళలు నిరసన గళం విప్పారు. తమకు తాగునీరు అందడం లేదంటూ గురువారం రామరాజులంక పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి బయట నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలల నుంచి రామరాజులంకలో తాగునీటి సరఫరా లేదని, 50రోజుల కిందట గ్రామ సభలో తాగునీటి కోసం నిరసన వ్యక్తం చేయగా పరిష్కరిస్తామని చెప్పిన పంచాయతీ కార్యవర్గం, అధికారులు ఆ ఊసు ఎత్తడం లేదని ఆరోపించారు. తమకు తాగునీటి సమస్యను పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. నిరసన జరిపిన వారిలో ఒగ్గు లక్ష్మి, గంటా వెంకటదుర్గామహాలక్ష్మి, ముత్యాల నాగవెంకటసత్యవతి, ముద్దల శ్రీను, నార్ని పాపారావు, గంటా దుర్గాప్రసాద్, బేతినీడి భాస్కరరావు, మావుళ్ల, బెల్లంకొండ శ్రీను, ఎం.సతీష్, పేరయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.


బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

ముమ్మిడివరం, ఆగస్టు 29: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యతని కార్మిక శాఖ జిల్లా సహాయ అధికారి కేబీఆర్ శర్మ పేర్కొన్నారు. చైల్డ్ లేబర్ డ్రైవ్‌లోభాగంగా ముమ్మిడివరం నగరపంచాయతీ పరిధిలోని పలు షాపులు, హోటళ్లను సహాయకార్మిక అధికారి బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించింది. పిల్లలను పనిలో పెట్టుకుంటే నేరమన్నారు. రామచంద్రపురం అసిస్టెంట్ లేబర్‌ఆఫీసర్ ఎ.విజయ్‌ప్రకాష్, ఏఎల్ఏస్ కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, సోషల్‌వర్కర్ త్రిమూర్తు, ఐసీడీఎస్ కౌన్సిలర్ వెంకటేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ


కాట్రేనికోన, ఆగస్టు 29: చెయ్యేరులో గురువారం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పలువురిని పరామర్శించారు. త్సవటపల్లి సూర్యనారాయణ, నంద్యాల బాబ్జీ, సవరపు అచ్చిబాబు ఇటీవల మృతిచెందగా ఆయా కుటుంబాలను పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు సూదా బాబూరావు, నంద్యాల వెంకన్నబాబు, గుత్తుల బుజ్జి, పవన్, నంద్యాల బాబి, కాయల బలరామ్‌నాయుడు, గుబ్బల ఏసు, ఉచ్చుల నారాయణ, బాలూయాదవ్, నంద్యాల దొరబాబు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా మృత్యుంజయరావు



మామిడికుదురు,ఆగస్టు 29: మామిడికుదురు తహసీల్దార్‌గా మృత్యుంజయరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్వోలతో సమావేశం నిర్వహించి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు.

తహశీల్దార్‌గా శ్రీపల్లవి



పి.గన్నవరం, ఆగస్టు29: పి.గన్నవరం తహశీల్దార్‌గా పి.శ్రీపల్లవి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో కృష్ణ జిల్లా పామర్రులో విధులు నిర్వహించిన ఆమె అనంతరం అయినవిల్లి మండ లంలో బాధ్యతలు స్వీకరించారు. రాజకీయపరంగా తలెత్తిన పలు అంశాలు నేపథ్యంలో మళ్లీ ఇక్కడకు వచ్చారు.

తహశీల్దార్‌గా నాగలక్ష్మమ్మ



అయినవిల్లి,ఆగస్టు29: అయినవిల్లి తహసీల్దార్‌గాసీహెచ్ నాగలక్ష్మమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పరమట శ్రీపల్లవి పి.గన్నవరంబదిలీపై వెళ్లారు.

ఎస్సీ వర్గీకరణపై రివ్యూ పిటిషన్ వేస్తాం

రాజోలు, ఆగస్టు29: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేస్తున్నామని శివకోటి సర్పంచ్ నక్కా రామారావు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ రాజోలులో మాలమహానాడు నాయకులు గురువారం నిరసన చేపట్టారు. మాలల న్యాయపోరాట సమితి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు జేఏసీ రాజోలు మండల కన్వీనర్ మట్టా సురేష్‌కుమార్ సారథ్యంలో రాజోలు అంబేడ్కర్ సామాజిక భవనం వద్దకు చేరుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.భారీ ర్యాలీగా రాజోలు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వైస్ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, జేఏసీ మండల నాయకులు లిఖితపూడి బుజ్జి, చింతా మధుకుమార్, బత్తుల మురళీకృష్ణ, విప్పర్తి సాయిబాబు, బొంతు మణిరాజు, నల్లి శ్రీనివాస్, బత్తుల జనార్ధనరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ముమ్మిడివరం, ఆగస్టు 29: ముమ్మిడివరం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. మండలంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఫీడర్, అనాతవరం ఫీడరు పరిధిలోని సీహెచ్ గున్నేపల్లి, అనాతవరం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

కాట్రేనికోన: కాట్రేనికోనవిద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.కాట్రేనికోన టౌన్, జీకే పొర, వేట్లపాలెం, చిర్రయానాం, గెద్దనపల్లి, నడవపల్లి, కుండలేశ్వరం, దొంతికుర్రు, కొప్పిగుంట, పండి.పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, మొల్లేటిమొగ గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

గోపాలపురం బాలిక హైదరాబాద్‌లో మృతి



రావులపాలెం, ఆగస్టు29:వారంరోజుల క్రితం జ్వరం వచ్చిన ఓ బాలిక చికిత్స అనంతరం హైదరాబాద్ బంధువుల ఇంటికి తల్లిదండ్రులతో వెళ్లింది. అక్కడ ఒక్కసారిగా ఆరోగ్యం వికటించి మృతిచెందింది. స్థానికుల, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం మండలం గోపాలపురంలోని మైగాపులవారి వీధిలో నివాసంఉంటున్న బుడుతు ఏసు- గంగాభవాని కుమార్తె బుడుతు ప్రియాంక(11)కు వారం క్రితం జ్వరం వచ్చింది.స్థానిక ఆర్ఎంపీ వైద్యులు, పీహెచ్‌సీల వద్ద వైద్యం పొందింది. ఈనెల27న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి తల్లిదండ్రులతో కలిసి వెళ్లింది. గురువారం ఉదయం ఒక్కసారిగా వాంతులైన్నుహ కోల్పోడంతో అక్కడ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలిక మృతదేహాన్ని గురువారం రాత్రికి స్వగ్రామానికి తీసుకువచ్చారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన

ఐ.పోలవరం, ఆగస్టు 29: కేశనకుర్రు శివారు పల్లిగూడెంలో గురువారం కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్డీఏ పీడీ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఆర్డీవో, తహశీల్దార్, ఎంపీడీవో, ట్రాన్స్‌కోఏఈ, సర్పంచ్ బీర సత్యకుమారి, ఎంపీటీసీలు వనచర్ల వెంకటేశ్వరరావు, విజిల్‌రాజు, చిలువూరి సుబ్బరాజు, కేశవరామరాజు, గాదిరాజు శ్రీనురాజు, యనమదల ఆదినారాయణ, చింతా లోవరాజు, జనసేనఅధ్యక్షుడు గుత్తుల శ్రీనుపాల్గొన్నారు.

